గోషామహల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసులు



అబిడ్స్: గోషామహల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శ్రీనివాసులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంపాటు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన నాగం రవీందర్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఫిల్మ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులును నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు గతంలో మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణకు స్థానిక ప్రజల సహకారంతో తనవంతు కృషి చేస్తానన్నారు.

టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్‌గా రమేష్‌నాయక్



గోల్కొండ: కొత్తగా ఏర్పాటైన టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్.రమేష్‌నాయక్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. షేక్‌పేట్ డివిజన్ అజీజ్‌బాగ్ కాలనీలోని దుబాయ్ హౌస్‌లో టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అయింది. 2007 బ్యాచ్‌కు చెందిన ఎల్.రమేష్‌నాయక్ ఈ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు సాగుతానన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యమిస్తామన్నారు.

సౌత్ వెస్ట్ జోన్ డివిజన్ పేరు మార్పు

గోల్కొండ: సౌత్ వెస్ట్ జోన్ పరిధిలో కొత్తగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కావడంతో పోలీస్ డివిజన్ పేరు కూడా మారింది. కొత్తగా టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అయింది. దీంతో గతంలో ఉన్న గోల్కొండ డివిజన్ పేరును టోలిచౌకీ డివిజన్‌గా మార్చారు. గతంలో గోల్కొండ డివిజన్ పరిధిలోని గోల్కొండ, లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ ఉండేది. వీటికి ఒక ఏసీపీ ఉండేవారు. అయితే టోలిచౌకీ డివిజన్‌గా పేరు మారడంతో టోలిచౌకీ డివిజన్ ఏసీపీ పరిధిలో గోల్కొండ, లంగర్‌హౌస్, టోలిచౌకీ పోలీస్‌స్టేషన్లు ఉంటాయి. ప్రస్తుతం టోలిచౌకీ డివిజన్ ఏసీపీగా సయ్యద్ ఫయాజ్ ఉన్నారు.

అక్రమంగా నివాసం ఉంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి



చాంద్రాయణగుట్ట: పాతబస్తీలో అక్రమంగా నివాసం ఉంటున్న పాకిస్తానీ, బంగ్లాదేశీ, మయన్మార్ దేశస్తులను గుర్తించి వారి దేశాలకు వెంటనే పంపించాలని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకుల బృందం సోమవారం బండ్లగూడ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మాదరి చంద్రశేఖర్, బర్ల శ్రీనివాస్, పొన్న శ్రీనివాస్, పెండెం లక్ష్మణ్, మామిడి కృష్ణ, ఎడ్ల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఉస్మానియా జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ మహ్మద్ రఫీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

అంతర్జాతీయ మంత్రసానుల దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అబిడ్స్: అబిడ్స్ ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో అంతర్జాతీయ మిడ్‌వైఫ్ (మంత్రసానుల) దినోత్సవాన్ని నిర్వహించారు. కష్టకాలంలో మంత్రసానులు ఎంతో కీలకమని ఈ వేడుకలు జరిపారు. ఆసుపత్రిలో గర్భిణులకు అవగాహన కల్పించారు. సహజ ప్రసవం జరిగే విధంగా అవగాహన కల్పిస్తున్నట్లు ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు మంత్రసానులు చేస్తున్న కృషి అమోఘమని ఆమె అన్నారు. మంత్రసానులకు కూడా ఎంతో శిక్షణ కూడా అవసరమన్నారు.

నీటి సరఫరాలో కోతలు విధించొద్దు

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్



జలమండలి ఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వేసవిలో కార్వాన్ నియోజకవర్గానికి నీటి సరఫరాలో ఎటువంటి కోతలు విధించొద్దని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పైపులైన్ పనులు, నీటి సరఫరాలో కోత తదితర విషయాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..లంగర్‌హౌస్, నానల్‌నగర్, టోలిచౌకీ, జియాగూడ తదితర ప్రాంతాల్లో ఎగువ ప్రాంతాల్లో ఉంటున్న బస్తీలకు లో ప్రెజర్‌తో నీరు వస్తుందన్నారు. లో ప్రెజర్ సమస్యపై గతంలో తాను ఎన్నోసార్లు వివరించానని అయినా సమస్య పరిష్కారం కాలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో వస్తున్న నీరు ప్రజల తాగునీటి అవసరాలు కూడా తీర్చడం లేదన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రజలు ఎక్కువ శాతం నిరుపేదలే అని వారికి తాగునీటిని కొని తాగే ఆర్థిక స్థోమత లేదని ఆయన అన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా వేలాపాలా లేకుండా కొనసాగుతుందన్నారు. నల్లా ఎప్పుడు వస్తుందో తెలియక ప్రజలు గంటల తరబడి నల్లాల వద్దనే కూర్చుంటున్నారన్నారు. కిందిస్థాయి సిబ్బంది పనిపై పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొని ఉందన్నారు. ఎండి లైన్స్ శాతం పహాడ్, హకీంపేట్, కార్వాన్, లంగర్‌హౌస్ ప్రాంతాల్లో బూస్టర్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా మెరుగుపరచడానికి చొరవ చూపాలని తాను గతంలో కోరినా ఇప్పటి వరకు ఆ పనులు పూర్తి కాలేదన్నారు. వేసవిలో తాగునీటి సరఫరా నిలువలు సరిపడా ఉన్నాయని ప్రభుత్వం చెబుతుందని అయితే తాగునీటి సరఫరాలో కోతలు ఎందుకు విధిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పైపులైన్ల లీకేజీల ద్వారా ప్రతినిత్యం వేలాది లీటర్ల తాగునీరు వృథా అవుతుందన్నారు. లో ప్రెషర్ సమస్య తీరడంతో పాటు బూస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా పగిలిన పైపులైన్లను మార్చి కొత్తవి వేసి నీటి వృథాను అరికట్టాలన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్



గెలుపొందిన క్రీడాకారులతో సుమిత్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఓపెన్ అండర్–13, 15 టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో అండర్–15 మిక్స్‌డ్ డబుల్ విభాగంలో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన క్రీడాకారులు సాహితీశ్రీ, క్లౌ రియ తేజ్ గెలుపొందగా సింగిల్స్ విభాగంలో సాహితీ రన్నరప్‌గా నిలిచింది. అదే విధంగా బాలుర మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో అభిషేక్, రుత్విక్ గోల్డ్ మెడల్‌ను సాధించారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బ్యాడ్మింటన్ అంతర్జాతీయ క్రీడాకారుడు సుమిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. మ్యాచ్‌పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ నుంచి క్రీడాకారులు పెద్ద ఎత్తున పతకాలను సాధించడంపై మ్యాచ్ పాయింట్ హెడ్ కోచ్ ముప్పాల వేణు సంతోషం వ్యక్తం చేశారు.

సబ్ రిజిస్ట్రార్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి



అదనపు ఐజీకి వినతిపత్రం అందజేస్తున్న మారం జగదీశ్వర్, ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: పెద్ద అంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంజే మార్కెట్‌లోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అదనపు ఐజీ వెంకటరాజేష్‌కు వారు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మారం జగదీశ్వర్, ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ.. పెద్ద అంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ రవీందర్‌పై సోమవారం శ్రీనివాస్‌యాదవ్ అనే వ్యక్తి దుర్భాషలాడుతూ పాశవికంగా దాడిచేశారన్నారు. అధికారిని అగౌరపరిచిన ఈ ఘటనను టీఎన్జీఓస్ కేంద్ర సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సదరు వ్యక్తికి ఎలాంటి అభ్యంతరాలు ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలే తప్పా అధికారిపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ సందర్భంగా అదనపు ఐజీ వెంకట్‌రాజేష్ సానుకూలంగా స్పందించారు. తమ రిజిస్ట్రేషన్ శాఖలో అధికారులు, ఉద్యోగులపై ఎవరైనా దాడులు చేస్తే సహించేది లేదన్నారు. దాడులు చేసిన వారిపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు శ్రీనివాస్ గౌడ్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, కట్కూరి శ్రీకాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ సమీనాబేగం

యాకుత్‌పురా: తలాబ్‌కట్టాలో రూ.40 లక్షల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. తలాబ్ చంచలం డివిజన్‌లోని తలాబ్‌కట్టా అమన్‌నగర్.బీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఆయన కార్పొరేటర్ సమీనా బేగంతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..డివిజన్‌లోని తలాబ్‌కట్టా, చాచాగ్యారేజ్, భవానీనగర్, అమన్‌నగర్–బీ ప్రాంతాల్లో రూ.12 లక్షలతో ఎస్‌పీ–2 పైపులైన్, రూ.26 లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపట్టామని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పర్యటనలో మజ్లిస్ నాయకులు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్.బాలాచారి తదితరులు

పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దర్పణం సాహిత్య వేదిక, అశ్విని ప్రచురణల ఆధ్వర్యంలో రచయిత్రి చీదెళ్ల సీతాలక్ష్మీ రచించిన కవితా దర్పణం, శంకర నారాయణ రచించిన సీతా శతకం పుస్తకాల ఆవిష్కరణ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి మాట్లాడుతూ..రెండు భిన్నమైన పుస్తకాలను ఒకే వేదికపై ఆవిష్కరించుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో దర్పణం సాహిత్యవేదిక ఆధ్వర్యంలో సూర్యప్రకాష్ రావు, చిత్రకారిణి రూపాదేవి, సీతారాంబాబు, ముదిగొండ సంతోష్‌కుమార్ శర్మ పాల్గొన్నారు.

‘స్పర్శలేని శిల’ పుస్తకావిష్కరణ

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉదయ సాహితీ–తెలంగాణల సంయుక్తాధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి ఎస్.లహరి రచించిన ‘స్పర్శలేని శిల’పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనమండలి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ..స్త్రీ భావాలను, సాధికారతను పెంచే కవిత్వం రాశారని, రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ద్వాసం సేనాధిపతి, కవి ముప్వా శ్రీనివాసరావు, సినీగేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో వ్యక్తిత్వ వికాసమే లక్ష్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదా ధామంలో బాలబాలికల వ్యక్తిత్వ వికాసం కోసం సంస్కార సాధనా వర్గను శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ అకడమిక్ ఇన్‌చార్జి నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో బాలబాలికలకు చక్కటి విద్య, సంస్కారాలను అందించేందుకు విద్యారంగంలో విద్యా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. కేవలం శిశు మందిరాల్లో చదువుతున్న బాలబాలికలకే కాకుండా, సమాజంలోని అందరి బాల బాలికలకు సంస్కారం అందాలన్న లక్ష్యంతో వేసవి సెలవులలో సంస్కార సాధనా వర్గ శ్రీ సరస్వతీ విద్యాపీఠం నిర్వహిస్తుందన్నారు. చిన్నారుల వ్యక్తిత్వ వికాసానికి అవసరమయ్యేలా దేశభక్తుల కథలు, మహాపురుషుల జీవిత చరిత్రలు, సంగీతం, వేద గణితం తదితర విషయాలు నేర్పిస్తారన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ పౌరులుగా ఉజ్వల భవిష్యత్‌ను సొంతం చేసుకోవాలని సూచించారు. వీటిని నిత్యం జీవితంలో కూడా అలవాటు చేసుకోవాలని విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు పేర్కొన్నారు. సంస్కార సాధనా వర్గ ప్రారంభ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త వేద ప్రకాష్ అగర్వాల్, చెరువు రాంబాబు, శ్రీ సరస్వతీ విద్యా పీఠం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పరమానంద బన్సల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గున్నాల దశరథరెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

హుస్సేనీ ఆలం ఇన్‌స్పెక్టర్‌గా ఆంజనేయులు



ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్

దూద్‌బౌలి: శాంతి భద్రతలకు భంగం కలిగించే సంఘవిద్రోహశక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హుస్సేనీ ఆలం ఇన్‌స్పెక్టర్ అంబటి ఆంజనేయులు అన్నారు. హుసేని ఆలం ఇన్‌స్పెక్టర్‌గా సోమవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సురేందర్ వెస్ట్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులు హుస్సేనీ ఆలం ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ సున్నితమైన ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం దూద్‌బౌలి కార్పొరేటర్ మహమ్మద్ సలీం ఇన్‌స్పెక్టర్‌ను కలిసి సన్మానించారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



లంగర్‌హౌస్: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 65 వద్ద నడుస్తూ ఓ వృద్ధుడు కిందపడ్డాడు. ఎంతకీ కదలకపోవడంతో వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ వృద్ధుడిని పరిశీలించగా అప్పటికే అతను మృతిచెందాడు. మృతుని వివరాలు తెలియరాలేదని సంబంధీకులు లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

వ్యక్తి అదృశ్యం



అక్షయ్‌కుమార్

జియాగూడ: ఇంటి నుంచి బయటకి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళ్‌హాట్ ఆగాపురా ప్రాంతంలో ఉంటున్న వంగూరి అక్షయ్‌కుమార్(33), వృత్తిరీత్యా మెకానిక్. కాగా ఆదివారం ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లల్లో వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా మ్యాన్‌హోళ్ల నిర్వహణ



ఖాజీగల్లీలో ధ్వంసమైన మ్యాన్‌హోల్ మూత

గోల్కొండ: డ్రైనేజీ పైపులైన్ల నిర్వహణ అధ్వానంగా తయారవుతోంది. కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్, లంగర్‌హౌస్, టోలిచౌకీ డివిజన్‌లలో మ్యాన్‌హోళ్ల మూతలు పూర్తిగా ధ్వంసమై ఏడాది గడుస్తున్నా వాటిని మార్చడం లేదు. కార్వాన్ బాంజావాడి, కార్వాన్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల కారణంగా ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. టోలిచౌకీ, గోల్కొండ డివిజన్‌లలో సైతం ఇదే దుస్థితి నెలకొని ఉంది. పలు చోట్ల స్థానికులు ప్రమాదాలను నివారించడానికి ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల మూత వద్ద హెచ్చరికగా చెట్టు కొమ్మలు, ఎత్తైన కర్రలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో చలనం లేకుండాపోతుంది.

‘ప్రజావాణి’ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్ అన్నారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట నర్కిఫూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట సర్కిల్‌కు చెందిన ఒకే ఒక ఫిర్యాదు పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులకు అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ మురుగునీటి సమస్య, రోడ్లు, వీధి దీపాలు ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, వెటర్నరీ బ్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న పలు కంపెనీల ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకపాత్ర పోషించబోతుందని బయోటిక్ స్పియర్ రీసెర్చ్ ఇండియా చీఫ్ సైంటిఫిక్ అడ్వైజర్ హరియన్ సోదరి అన్నారు. సోమవారం అబిడ్స్ చాపల్ రోడ్డులోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ అనే అంశాలపై వేసవి శిక్షణా శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి తరం విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ వేసవి శిక్షణ శిబిరం జూన్ 13వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ పార్టనర్ మేనేజర్ పూర్ణిమ, స్పెయిన్ టెక్నాలజీ సీఈఓ నితీష కళాశాల కార్యదర్శి కృష్ణారావు, ప్రిన్సిపాల్ సత్యప్రసాద్, డైరెక్టర్ అనురాధ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాంపల్లి: తెలుగు భాష చైతన్య సమితి, లక్ష్య సాధన ఫౌండేషన్ 12వ వార్షికోత్సవాల సందర్భంగా తెలుగు భాష అంతర్జాతీయ సదస్సు, అంతర్జాతీయ కవి సమ్మేళనం సభను ఈ నెల 8న గురువారం ఉదయం 9 గంటలకు చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గాన సభలో జరుగుతుందని నిర్వాహకులు పి.బడేసాబ్ తెలిపారు. తెలుగు భాషకు పట్టాభిషేకం శీర్షికన జరుగుతున్న కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రజ్ఞారాజు, రామకృష్ణ చంద్రమౌళి, డాక్టర్ రాధ కుసుమ, సరోజినిదేవి, గంటా మనోహర్ రెడ్డి, డాక్టర్ ఎడ్ల కల్లేష్, డాక్టర్ జయ ప్రకాష్ పాల్గొన్నారు.

‘తెలంగాణలో బీజేపీ బలీయంగా ఉంది’



కిషన్‌రెడ్డితో బీజేపీ నాయకుడు జగదీష్‌కుమార్

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ బలీయంగా ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రాభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జనగణనతో పాటు కులగణనను కూడా చేయిస్తామని ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రకటించడం సాహసోపేతమైన నిర్ణయం అన్నారు. నాయకులు డిజ్వర్‌సింగ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, బీజేపీ నాయకులు ఉద్దడి జగదీష్‌కుమార్ తదితరులున్నారు.

మున్నూరు కాపు కులస్తుల అభ్యున్నతికి కృషి చేయాలి



పాతనగర మున్నూరు కాపు నూతన కార్యవర్గంతో అధ్యక్షుడు ఆరే దత్తు

గౌలిపురా: పాతనగర మున్నూరు కాపు నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా అధ్యక్షుడు ఆరే దత్తు ఆధ్వర్యంలో గౌలిపురాలోని శాంతినికేతన్ పాఠశాలలో కార్యవర్గ పరిచయ వేదిక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర రావు, మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆత్మకూరి ప్రీతి, కె.ఎస్.ఆనంద్‌రావు హాజరై పాతనగర మున్నూరు కాపు నూతన కార్యవర్గాన్ని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అందరూ ఐక్యంగా ఉండి కులస్తుల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, సలహాదారులు, ముఖ్య సలహాదారులు మణికొండ రమేష్, సప్పిడి శ్రీనివాస్, కె.ఎస్.ఆనంద్ రావు, పొన్న సునీత, కొత్త కల్పన, కె.రమేష్, ఎ.ప్రసన్న, కె.సురేశ్, కె.గోవింద్ రాజ్, పంచాజన్యం, మాణిక్ ప్రభు, కొప్పుల అనిల్, కె.చంద్రశేఖర్, పొన్న వెంకటరమణ పాల్గొన్నారు.

జై పవన్‌రాజ్ ఘన విజయం



సుల్తాన్‌బజార్: కాచిగూడ ఆరె కటిక సంఘం ఎన్నికల్లో ఇస్మామియాబజార్‌కు చెందిన జై పవన్‌రాజ్ ఘన విజయం సాధించారు. ఎంతో పారదర్శకంగా జరిగిన ఈ ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా వారు పదుల సంఖ్యలో ఓట్లు సాధించగా పవన్ రాజ్‌కు 692 ఓట్లు వచ్చాయి. ఈ సందర్భంగా పవన్‌రాజ్ మాట్లాడుతూ..కాచిగూడ ఆరె కటిక సంఘానికి గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నికలు జరగకపోవడంతో సంఘం నిధులను కొందరు దుర్వినియోగం చేశారన్నారు. ప్రస్తుతం తాను అందరి సహకారంతో విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన విజయానికి సహకరించిన వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ కమిటీ చైర్మన్ బాలరాజు, వైస్ చైర్మన్ రవికుమార్, ట్రస్ట్ చైర్మన్ నర్సింగ్‌రావు, సంజయ్‌రాజ్ దంబిక శ్రీనివాస్, జితేందర్, వెంకటేష్, ఉదయ్, మురళీధర్, వినయ్, ఉదయ్‌కుమార్, అశోక్ తులసి గోవింద్‌రాజ్ పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి రిమాండ్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ మహ్మద్ జావీద్, ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి

చాంద్రాయణగుట్ట: పాన్‌షాపు నిర్వాహకుడు మాజిద్ హత్య కేసులో ముగ్గురు నిందితులను ఫలక్‌నుమా పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఫలక్‌నుమా ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏసీపీ మహ్మద్ జావీద్, ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డితో కలిసి వివరాలను వెల్లడించారు. వివరాల ప్రకారం ..స్టార్ పాన్ మహల్ నిర్వాహకుడు వట్టెపల్లికి చెందిన మహ్మద్ మాజిద్ 2018లో మహ్మదనగర్‌లో అద్దెకి ఉండేవాడు. ఆ సమయంలో స్థానికంగా నివసించే షేక్ మహ్మద్ అలీతో పరిచయం ఏర్పడింది. కొద్ది రోజుల అనంతరం మాజిద్ అక్కడి నుంచి ఇల్లు ఖాళీ చేసి వేరే ప్రాంతానికి వెళ్లిపోయాడు. ఇదిలా ఉండగా షేక్ మహ్మద్ అలీ తల్లి మరణించడం, తన సోదరుల ఆరోగ్యం క్షీణించడంతో మాజిద్ బ్లాక్ మ్యాజిక్ చేస్తున్నాడని అనుమానం పెంచుకొని ఎట్టకేలకు హతమార్చాలని నిర్ణయించుకొని ఈ నెల 2న పథకం ప్రకారం షేక్ మహ్మద్ అలీ (32), షేక్ ఉస్మాన్ అలీ (25), షేక్ అక్తర్ అలీ (72) మాజిద్ పాన్ మహల్ వద్దకు వచ్చి కత్తితో పొడిచి హతమార్చాడు. కేసు నమోదు చేసుకున్న ఫలక్‌నుమా పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.